క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు సందడిగా మారాయి. మండల కేంద్రమైన కౌతాళంతో పాటు మండల పరిధిలోని అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయ స్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుదుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయ స్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళ హారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కౌతాళం: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పనులను పూర్తి చేయాలని ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా అన్నారు. మండల కేంద్రమైన కౌతాళంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన పర్యవేక్షించారు. సర్పంచ్ పాల్‌దినకర్ ఆధ్వర్యంలో శనివారం రెండో వార్డులో పనులను పంచాయతీ సిబ్బంది ముమ్మరంగా చేపట్టారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో ఆదోని వాసికి చోటు



వీరచంద్ర యాదవ్

ఆదోని సెంట్రల్: ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో ఆదోని పట్టణానికి చెందిన జి. వీరచంద్ర యాదవ్‌కు చోటు దక్కిందని ఎస్టీయూ ఆదోని పట్టణ, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, భీమరాజు, నాగరాజు, రమేష్ నాయుడు, లోక్యానాయక్ శనివారం తెలిపారు. వారు మాట్లాడుతూ విజయవాడలో ఎస్టీయూ రాష్ట్ర ప్రథమ కార్యవర్గ సమావేశంలో జి. వీరచంద్ర యాదవ్‌ను ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కమిటీ కన్వీనర్‌గా ఎన్నుకున్నారన్నారు. వీరచంద్రయాదవ్ ఎస్టీయూ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేశారన్నారు.

నిషేధిత పురుగు మందులు విక్రయిస్తే చర్యలు



ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలను తనిఖీ చేస్తున్న ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి

ఆదోని రూరల్: మండలంలో ఎవరైనా నిషేధిత పురుగు మందులను విక్రయిస్తే చర్యలు తప్పవని ఏఓ అశోక్‌కుమార్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం నిషేధిత మందుల రవాణాపై పట్టణంలోని ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీలను తనిఖీ చేశారు. ట్రాన్స్‌పోర్ట్ ఏజెన్సీల వారు నిషేధిత గడ్డి మందు గ్లైఫోసిట్, పురుగు మందులను రవాణా చేస్తున్నట్లుగా తెలిస్తే తమకు సమాచారం అందించాలన్నారు. పురుగు మందుల చట్టం 1966 ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.


అబ్దుల్ కలాంకు నివాళి



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ, అధికారులు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లలోని మండల పరిషత్ సమావేశ భవనంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 9వ వర్ధంతిని శనివారం ఎంపీపీ టీ.నసురుద్దీన్ ఆధ్వర్యంలో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబు భాస్కర్, ఈఓఆర్డీ నాగేష్, ఎంఈఓ నీలకంఠ, వైఎస్సార్‌సీపీ నాయకులు బందెనవాజ్, మురళీ నాయుడు, పద్మనాభం, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి



గెలుపొందిన విద్యార్థినులు

కోసిగి: బాలికలు చదవుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ రీజినల్ డైరెక్టర్ సరస్వతి అన్నారు. శనివారం మండలంలోని జంపాపురం గ్రామంలో ఆర్డీటీ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో కౌతాళం, కోసిగి, మంత్రాలయం మండలాలలోని 12 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 2 కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థినులకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఆయా పాఠశాలల నుంచి 134 మంది విద్యార్థినులు పోటీల్లో పాల్గొన్నారు. మొదటి, ద్వితీయ తృతీయ స్థానం రాణించి విద్యార్థినులకు షీల్డు, మెడల్, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్, పీడీ రాజారామ్, నరసింహ రాజు ఆర్డీటీ ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య పాల్గొన్నారు.

వ్యాధుల కాలం.. జాగ్రత్తలు అవసరం

- వర్షాకాలంలో పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
- నిర్లక్ష్యం వహిస్తే పశువుల ప్రాణాలకే ముప్పు
- పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలంటున్న పశువైద్యులు



సుబ్రమణ్యం ఆచారి, పశుసంవర్ధకశాఖ ఏడీ

ఎమ్మిగనూరు: వర్షాకాలం మనుషులతో పాటు పశువులకు అనేక వ్యాధులు ప్రబలుతున్నాయి. మనుషుల్లో ఫ్లూ జ్వరాలు, కళ్లకలకలు, విరేచనాలు. పశువుల్లో.. గొర్రెలు, మేకలకు వైరస్ వ్యాధులు చుట్టుముట్టే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో పాడి పెంపకందార్లు పశువులకు వ్యాధులు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే జీవాల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఎమ్మిగనూరు పశుసంవర్ధకశాఖ ఏడీ సుబ్రమణ్యం ఆచారి చెబుతున్నారు.

పశువులకు టీకాలు

జిల్లాలో ఆవులు 2,36 లక్షలు, గేదెలు 1.27లక్షలు, మేకలు 3.05 లక్షలు, గొర్రెలు 11.03 లక్షలు, కోళ్లు 5.85లక్షలు ఉన్నట్లు పశుసంవర్ధకశాఖ గణాంకాలు చెబుతున్నాయి. పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు జబ్బువ్యాధి, గొర్రెలకు చిటుక వ్యాధుల నివారణకు ఇటీవల టీకాలు వేశారు. ప్రస్తుతం గాలికుంటు వ్యాధి నివారణకు వ్యాక్సినేషన్లు మొదలు పెట్టారు. రైతులు తప్పనిసరిగా వేయించాలని ఏడీ సూచించారు. పశువుల్లో వచ్చే వ్యాధులు వాటి నివారణకు తీసుకోవాలన్సిన జాగ్రత్తలను వివరించారు.



మేపులో గొర్రెల మంద

గాలికుంటవ్యాధి

ఇది వైరస్‌వల్ల కలిగే వ్యాధి. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు తదితర జీవాల్లో కనిపించే వ్యాధి. వ్యాధి లక్షణాలను పరిశీలిస్తే నోటిలో, కాలి గట్లలో పుండ్లు ఏర్పడుతాయి. జ్వరం ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి సోకిన పాడి పశువులు నాలుగు నెలల్లోనే ఒట్టిపోతాయి. నివారణకు బోరిక్ గ్లిజరిన్ పేస్టును నోటిలో పూయాలి. పీపీ ద్రావణంతో కాలిగిట్టల మధ్య బాగా కడగాలి. యాంటిబయాటిక్ మందులు, లివర్ టానిక్‌లు వాడాలి. ప్రతిఏటా వర్షాకాలానికి ముందుగానే వాక్సినేషన్ చేయించాలి.

నేలముచ్చుతెగులు (చిటుకవ్యాధి)

చిటుక వ్యాధి బ్యాక్టీరియా వల్ల వ్యాప్తి చెందుతోంది. గొర్రెల్లో ఎక్కువగా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతోంది. వ్యాధి లక్షణాలు ఉన్న జీవాలు తూలుతూ నడుస్తాయి. ఉన్నట్లుండి గాలిలో ఎగిరి వెనువెంటనే (చిటికెలో) చనిపోతూ ఉంటాయి. అందువల్ల దీన్ని చిటుకవ్యాధిగా పిలుస్తారు. ఒక మందలో పదికిపైగా జీవాలు చనిపోతే చిటుకవ్యాధి సోకినట్లు నిర్ధారణ చేస్తారు. మందలో నీరసంగా ఉన్న గొర్రెలను వేరుగా ఉంచాలి. వ్యాధి నివారణకు పెన్సిలిన్ వాక్సిన్ వేయాలి. వ్యాధి సోకనివాటికి కూడా వాక్సిన్ వేయించాలి.

నీలినాలుక వ్యాధి

గొర్రెలు, మేకల్లో ఎక్కువగా నీలికుంటవ్యాధి వస్తుంది. ఈ వ్యాధులు వైరస్ వల్ల వ్యాప్తి చెందుతాయి. ఈ వ్యాధి సోకిన జీవాల్లో జ్వరం తీవ్రత ఎక్కువగా ఉంటుంది. నోటి నుంచి సొంగ కారుస్తాయి. గిట్టలకు పుండ్లు ఏర్పడుతాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు ఆహారం తీసుకోవు. దానివల్ల బాగా నీరసించి పోతాయి. ఈ వ్యాధి సోకిన జీవాలు మంద నుంచి అవే వేరుపడతాయి. ఈ వ్యాధి నివారణకు యాంటిబయాటిక్ మందులు, లివర్ టానిక్‌లు వాడాలి. ఆరోగ్యంగా ఉన్న జీవాల నుంచి వీటిని వేరుచేసి చికిత్స అందించాలి.

వర్షాకాలంలో పాటించాల్సిన జాగ్రత్తలు

- దాణా అందుబాటులో ఉంచుకోవాలి. తడిసిన దాణా పెట్టకూడదు.
- పశువుల పాకలను శుభ్రంగా ఉంచుకోవాలి.
- ఎండుగడ్డి తడవకుండా ఏర్పాట్లు చేసుకోవాలి.
- మేతను అధికంగా పశువులకు పెట్టకూడదు. అన్నింటిని ఒకే గాదెకు కట్టకూడదు.
- అధిక వర్షాలు, వరదల వల్ల జంతువులు చనిపోతే పూడ్చిపెట్టాలి
- యాంటిబయాటిక్స్, పెయిన్ కిల్లర్ మందులను షెడ్లలో అందుబాటులో ఉంచుకోవాలి.
- పశువులకు మేత, తాగునీరు సమృద్ధి ఉంచుకోవాలి
- అత్యవసర సేవలకు టోల్‌ఫ్రీ నెంబర్ 1962కు కాల్ చేయాలి.

గొంతువాపు వ్యాధి

బ్యాక్టీరియా వల్ల గొంతు వాపు వ్యాధి వ్యాప్తి చెందుతుంది. అన్ని వయసుల ఆవులు, గేదెల్లో ఇది విస్తరిస్తుంది. వ్యాధి లక్షణాలకొస్తే 105, 106 డిగ్రీల జ్వరం ఉంటుంది. నోటి నుంచి నురుగు(సొంగ)కారుతూ ఉంటుంది. నోటితోనే ఎక్కువగా శ్వాస తీసుకుంటాయి. మేత మేయడానికి గొంతులో వాపు అడ్డుగా ఉంటుంది. నివారణకు సల్ఫాడిమిడిన్ మందులను వాడాలి. నాలుగు నెలలు దాటిన పశువులకు వ్యాక్సిన్ కచ్చితంగా వేయించాలి.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

నందవరం : ప్రజా సమస్యలు, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని హాలహర్వి గ్రామంలో సబ్ కలెక్టర్ పర్యటించారు. గ్రామంలో పాఠశాలలు, ఆరోగ్యకేంద్రం, అంగన్‌వాడీ కేంద్రం, నీటి ట్యాంకులు, అపరిశుభ్ర పరిసరాలను పరిశీలించారు. గ్రామంలో నెలకొన్న అపరిశుభ్రత, ప్రజా సమస్యలను పట్టించుకోని రెవెన్యూ, సచివాలయం ఉద్యోగులపై మండిపడ్డారు. అనంతరం సచివాలయంతో ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. గ్రామ సమస్యలు తెలుసుకోవడానికి సచివాలయం ఉద్యోగులు ఇంటింటికి వెళ్లాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలను తనిఖీ చేసి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల గదుల్లో ఉన్న అపరిశుభ్రతపై హెచ్‌ఎంను నిలదీశారు. అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి నిర్వహణ తీరు తెలుసుకున్నారు. గ్రామంలో పట్టాలు పొందిన 40 మందికి స్థలాలు చూపించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు.



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

మట్టి తరలింపుపై ఆగ్రహం

గ్రామ సమీపంలోని చెరువులో ఇటుక బట్టీల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్తులు సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈపై మండిపడ్డారు. చెరువులో అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని, చెరువులో మట్టిని తవ్వుతున్న జేసీబీని సీజ్ చేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎల్‌డీవో నాగేశ్వరరావు, డీఎల్‌పీవో నూర్జహాన్, తహసీల్దార్ ఓబులేసు, ఎంపీడీవో కిరణ్‌మోహన్‌రావు ఉన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

ఆదోని సెంట్రల్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు జరగనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి శనివారం తెలిపారు. స్పాట్ అడ్మిషన్లలో 2024వ సంవత్సరం పాలిసెట్ పాసైన వారితో పాటు పాలిసెట్ పరీక్షలో ఉత్తీర్ణులు కాని వారు కూడా కళాశాలలో చేరవచ్చని తెలిపారు. 10వ తరగతి పాసైన వారు పాలిటెక్నిక్ కోర్సు చదవాలని, ఆసక్తి కలిగిన ప్రతి విద్యార్థి ఈ స్పాట్ అడ్మిషన్లకు హాజరు కావచ్చునన్నారు. కళాశాలలో ఈఈఈ (ఎలక్ట్రికల్), ఈసీఈ (ఎలక్ట్రానిక్స్) కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్‌తో 31న ఉదయం 10 గంటలకు కళాశాలలో హాజరుకావాలన్నారు. ప్రాసెసింగ్ ఫీజు రూ. 900, స్పాట్ అడ్మిషన్లు పొందిన అభ్యర్థులు రూ.5,400లు ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

రుణాలు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలి

గోనెగండ్ల : బ్యాంకులో లోన్ తీసుకున్న రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్, క్రెడిట్ ఎస్‌పీఎంలు అమర్నాథ్, శ్రీనివాసరావు సూచించారు. శనివారం మండలంలోని కులుమాల గ్రామ సచివాలయంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. క్రాప్ లోన్లు సకాలంలో రెన్యూవల్ చేసుకుంటే తక్కువ శాతం వడ్డీ పడుతుందన్నారు. ఎస్‌బీఐ ఫీల్డ్ ఆఫీసర్ మధు, రికవరి ఏజెంట్‌లు రవి, విజయ్, బీసీలు అక్బార్, మిన్నల్లా, బడేసా తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను అర్థం చేసుకోవాలి

ఆదోని రూరల్: మానవీయ విలువలు, కామన్‌సెన్స్ ఉంటే చట్టాలను సులభంగా అర్థం చేసుకోవచ్చని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. శనివారం డాక్టర్ జ్యోతిర్మయి డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాల కరస్పాండెంట్ మురళీబాబు మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులకు చదువుపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదు లు హుసేన్‌సాని, శ్రీధర్‌సింగ్, యూజీ శ్రీనివాసులు, వెంకటసుబ్బన్న పాల్గొన్నారు.



విద్యార్థులకు సూచనలిస్తున్న జడ్జి యజ్ఞ నారాయణ

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

ఆదోని రూరల్: అక్రమ మద్యం సరఫరాపై ఉక్కుపాదం మోపుతామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని సెబ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సెబ్‌శాఖపై మరింత నమ్మకం పెరిగేలా ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. ప్రతి స్టేషన్ ఆవరణం పచ్చదనం పెంపొందించాలన్నారు. నాటుసారా, అక్రమ ఇసుక, అసాంఘిక కార్యకలాపాలైన మట్కా, జూదం, నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ విన్నీలత, సీఐలు భార్గవరెడ్డి, స్వర్ణలత, ఆలూరు సీఐ మహమ్మద్‌బాషాలు, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో సమస్యలను పరిష్కరించాలి

పెద్దకడబూరు: మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, రైతు సంఘం సీనియర్ నాయకులు పరమేష్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దారు సురేష్‌బాబుకు సమర్పించారు. కార్యాలయానికి కాంపౌండ్ వాల్ లేక రాత్రి వేళలో కార్యాలయం ఆవరణలో ఆకతాయిలు మద్యం తాగి సీసాలను పగలగొట్టి వేస్తున్నారని చెప్పారు.

దొంగ అరెస్ట్

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలో నివాసం ఉంటున్న తోవి వెంకటేష్ ఇంట్లో ఈనెల 22న చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేట్టగా నిందితుడు కోసిగికి చెందిన రామక్కమ్మ కాలనీ నివాసం ఉంటున్న భీమయ్యగా గుర్తించినట్లు ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. శనివారం నిందితుడిని కోసిగి మార్కెట్ యార్డు సమీపంలో అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడిని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అలాగే 2023వ సంవత్సరంలో కోసిగిలో నరసింహులు, జయతీర్థ స్వామి ఇంట్లో కూడా దొంగతనం చేసింది కూడా తానేనని ఒప్పుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. రెండు కేసులకు సంబంధించి 30 గ్రాముల బంగారు చైన్లు, బంగారు పూత కలిగిన వెండి డాబా (వడ్డాణం)లను రికవరీ చేసినట్లు వెల్లడించారు. నిందితుడితో పాటు మరో ఇద్దరు రామాంజి, వెంకటేష్‌లు ఉన్నట్లు తెలిపారు. ఆ ఇద్దరు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామన్నారు. నిందితుడు పట్టుకునేందుకు, రికవరీకీ కృషి చేసిన పోలీస్ సిబ్బంది, ఏఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ మల్లికార్జున, ప్రభాకర్, ఆచారి, శ్రీనివాసులు, సంజీవ్, నాగేష్‌లను అభినందించారు.



పట్టుబడిన నిందితుడు, నగలతో ఎస్ఐ సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

గోనెగండ్ల : సీజనల్ వ్యాధుల నివారణకు అధికారులు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ నాగేష్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బాబు భాస్కర్ ఆధ్వర్యంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సాంబయ్య మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మల్టీ విలేజ్ స్కీం కింద 16 గ్రామాలకు నీటిని అందించనున్నట్లు తెలిపారు. వివిధ సమస్యలపై సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడారు. ఎంఈఓ రామాంజినేయులు, విద్యుత్ ఏఈ సుధాకర్, ఏపీఓ మహబూబ్ బాషా, పశువైద్యుడు మహమ్మద్ అలీ పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధిద్దాం

ఆదోని రూరల్: అసమానతలు లేని సమాజ నిర్మాణమే అంబేడ్కర్ ఆశయమని, ఆయన ఆశయాలను సాధిద్దామని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యం.డి.ఆనంద్‌బాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శనివారం ఆదోని పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్ద ఉన్న సుందరయ్యభవన్‌లో కేవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని మండలాధ్యక్షుడు మునిస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈనెల 30, 31వ తేదీల్లో మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో సామాజిక చైతన్య శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కేవీపీఎస్ మండల ఉపాధ్యక్షులు పరమేష్, కార్యదర్శి బి.తిక్కప్ప, సహాయ కార్యదర్శి తాయప్ప పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

ఆదోని సెంట్రల్: కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని షెల్ కంపెనీ మాజీ సీఈఓ కే.లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం ఆదోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విట్టా కిష్టప్ప, సుబ్బరత్నమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విట్టా సతీష్ అధ్యక్షతన కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మురళీ మోహన్, అధ్యాపకులు పాల్గొన్నారు.


ఎంఆర్‌పీలకే ఎరువులు విక్రయించాలి

ఎమ్మిగనూరుటౌన్: వ్యాపారులు ఎంఆర్‌పీకే ఎరువులు, యూరియా బస్తాలను రైతులకు విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, మల్లికార్జున డిమాండ్ చేశారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతి పత్రాన్ని ఏఓ మహేశ్వర్‌రెడ్డికి అందజేశారు. ఏసేపు, ఎంకప్ప, ప్రసాద్, బజారి, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

పెద్దకడబూరు : మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. శిక్షా సప్తహ్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రలోని ప్రాథమిక (మెయిన్) పాఠశాల ఆవరణలో విద్యార్థుల తల్లిదండ్రులతో మొక్కలను నాటించే కార్యక్రమం చేపట్టారు.

ఆదోని రూరల్: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని భీమా ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల సెక్రటరీ పి.ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కళాశాల ఆవరణలో కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు మొక్కలను నాటి ప్రతిజ్ఞ చేశారు. కళాశాల ప్రిన్సిపల్ జి.ఎస్.సురేంద్రబాబు, సీఎస్ఈ విభాగాధిపతి డా.ఆల్‌బర్ట్, ఉదయ్‌కిరణ్, శివమ్మ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో వేణు విద్యాలయం విద్యార్థుల ప్రదర్శన

పర్యావరణ పరిరక్షణపై ర్యాలీ

ఎమ్మిగనూరుటౌన్: పర్యావరణ పరిరక్షణపై శనివారం స్థానిక వేణు విద్యాలయం హైస్కూల్ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బాబునరేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్వానంగా మధ్యాహ్న భోజనం

మంత్రాలయం : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ ఆరోపించారు. శనివారం మధ్యాహ్న భోజనం విషయమై ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ రాఘవేంద్ర పాఠశాలకు వెళ్లి భోజనాలను పరిశీలించారు. ఆందోళనలో సమాఖ్య నాయకులు వీరేష్, నాగరాజు, వినోద్, అరవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో గృహ, నీటి కుళాయిలు, వీఎల్‌టీ పన్నుల వసూళ్లపై సిబ్బంది దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ సమావేశ భవనంలో సచివాలయ అడ్మిన్ సెక్రటరీలు, వార్డు అమెనీటి సెక్రటరీలు, రెవెన్యూ అధికారులు, ఆర్ఐలతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సిబ్బంది ఇంటింటికి వెళ్లి డిఫాల్టర్ లిస్టును పరిశీలించి శిస్తు వసూళ్లను వంద శాతం చేయాలని ఆదేశించారు. డీఈఈలు నీరజ, మనోహర్‌రెడ్డి, ఆర్ఓ బేబి, ఏఈలు మదన్, శరత్‌చంద్ర పాల్గొన్నారు.

పన్నులు చెల్లించండి

కౌతాళం: మేజరు పంచాయతీ పరిధిలో పన్నుల బకాయిలను వెంటనే చెల్లించాలని సర్పంచ్ పాల్‌దినకర్, కార్యదర్శి శివప్పలు కోరారు. ఇంటి పన్ను, కుళాయి పన్ను, వ్యాపారం చేస్తున్నారు లైసెన్స్ ఫీజులను చెల్లించి అభివృద్ధికి సహకరించాలన్నారు.

రాష్ట్రానికి నిధుల సాధనలో కూటమి విఫలం

ఎమ్మిగనూరుటౌన్: కేంద్రం నుంచి రాష్ట్రాభివృద్ధికి నిధులు తేవడంలో, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధనలో ఎన్‌డీఏ కూటమి ఘోరంగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రంలోని బీజేపీ రూ.15వేల కోట్లు అప్పుగా ఇచ్చి బిహార్ రాష్ట్రానికి మాత్రం రూ.59వేల కోట్ల నిధులు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై కూటమి నాయకులు దాడులకు పాల్పడుతుండటం శోచనీయమన్నారు. ప్రభుత్వం కేవలం శ్వేతపత్రాలను విడుదల చేస్తూ వైఎస్సార్‌సీపీనే నిందించడం సమంజసం కాదన్నారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చిన రాష్ట్రంలోని కూటమి నిధులు సాధించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతి హామీని అధికారంలోకి వచ్చిన నెలలోపే అమలు చేసి ప్రజల మన్ననలు పొందారని గుర్తు చేశారు. సూపర్ సిక్స్ పథకాల అమలు చేయడానికే ముఖ్యమంత్రి చంద్రబాబు భయమేస్తుందని అసెంబ్లీలో చెప్పడంతో ప్రజల్లో ఆందోళన మొదలైందన్నారు. తమ పార్టీ కౌన్సిలర్లు ఎవరు కూడా టీడీపీలోకి వెళ్లరని, వారికి తాము అండగా వుంటామని భరోసా ఇచ్చామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బుట్టా శివ నీలకంఠ, బుట్టా ప్రతుల్, బీఆర్ బసిరెడ్డి, లక్ష్మీకాంతారెడ్డి, భీమిరెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, ముగతి విరుపాక్షిరెడ్డి,స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కుటుంబానికి పరామర్శ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని పార్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ సత్యనారాయణరెడ్డి తల్లి మాజీ ఎంపీటీసీ సరస్వతమ్మ వారం క్రితం గుండెపోటుతో మృతి చెందారు. శనివారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక పార్లపల్లిలోని వారి స్వగృహానికి వెళ్లి ఆమె చిత్ర పటానికి నివాళ్లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బీఆర్ బసిరెడ్డి, బుట్టా నీలకంఠ, బుట్టా ప్రత్రూల్, భీమిరెడ్డి, నాయకులు ఉన్నారు.



సరస్వతమ్మ చిత్ర పటం వద్ద నివాళ్లర్పిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక

ఆదోని రైల్వేస్టేషన్ అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

ఆదోని అర్బన్: ఆదోని రైల్వేస్టేషన్‌లో రైల్వే అధికారులతో కలిసి ఆదోని రైల్వే స్టేషన్ అభివృద్ధి విషయంపై స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆదోని రైల్వే స్టేషన్‌కు అమృత భారత్ స్కీమ్ కింద కేంద్ర ప్రభుత్వం రూ.10.30 కోట్లు విడుదల చేసిన సందర్భంగా ప్రధాన నరేంద్రమోదీకి, రైల్వేశాఖ మంత్రి అశ్విన్‌వైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగుల కోసం త్వరలో లిఫ్ట్ సదుపాయం ఏర్పాటు చేయబోతున్నామని, రైల్వే ప్లాట్ ఫామ్స్ ఎక్స్‌టెన్షన్, అన్ని వసతులతో కూడిన వెయిటింగ్ హాల్స్, పే అండ్ యూజ్ స్కీం కింద మినరల్ వాటర్ ప్లాంట్, సులభ్‌లను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. ఆదోని మీదుగా విజయవాడకు వెళ్లే రైళ్లను కూడా ఏర్పాటు చేయాలని తీర్మానించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైల్వే అధికారులు వెంకటేశ్వర్లు, జాఫర్ఖాన్, మహమ్మద్ ఇర్ఫాన్, త్రిభువన్, సురేష్, ఆదోని రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సభ్యులు ఆదూరి విజయ్ కృష్ణ, జిందేసాయి కుమార్, రమేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో మతిస్థిమితం లేని వ్యక్తి వీరంగం



రాఘవేంద్రను స్తంభానికి కట్టేసిన దృశ్యం

ఆదోని అర్బన్: చికిత్స కోసం వచ్చిన మతిస్థిమితం లేని వ్యక్తి శనివారం ఉదయం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వీరంగం సృష్టించి వైద్యులను, ఆస్పత్రి సిబ్బంది భయభ్రాంతులకు గురి చేశాడు. మండలంలోని ఆరేకల్ గ్రామానికి చెందిన ఈడిగ నరసప్ప కుమారుడు ఈడిగ రాఘవేంద్ర(30) గత కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక పిచ్చిపిచ్చి ప్రవర్తిస్తుండటంతో కుటుంబసభ్యులు శనివారం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. క్యాజువాలిటీ వార్డులో చికిత్స చేయడానికి వచ్చిన వైద్యుడు, సిబ్బందిని చూసి రాఘవేంద్ర భయానికి గురై కేకలు వేస్తూ వారిపై దాడి చేయడమేగాకుండా అక్కడున్న వైద్య పరికరాలను, ఫ్యాన్లను స్టాండ్‌తో ధ్వంసం చేశాడు. సెక్యూరిటీ సిబ్బంది రోగిని బంధువుల సాయంతో అతి కష్టం మీద పట్టుకొని స్తంభానికి కట్టివేశారు. రాఘవేంద్ర చేసిన ధ్వంసంలో దాదాపు రూ.2 లక్షలు విలువ చేసే సంపద నష్టం జరిగిందని ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ శ్రీనివాసనాయక్ తెలిపారు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. రోగికి భార్య సుధ, కుమారుడు, కుమార్తె సంతానం. పదేళ్ల క్రితం రాఘవేంద్రకు వివాహం జరిగింది. అయితే రాఘవేంద్ర గత కొన్ని రోజులుగా పిచ్చిపిచ్చి పనులు చేస్తుండడంతో శనివారం ఉదయం ఆస్పత్రికి తీసుకొచ్చినట్లు రోగి బంధువు లక్ష్మణ్ తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

ఆదోని టౌన్: స్థానిక కార్వన్‌పేటలో జరుగుతున్న పూడికతీత పనులను కమిషనర్ రామచంద్రారెడ్డి శనివారం పరిశీలించారు. ఇంజినీరింగ్, శానిటేషన్ సెక్షన్ అధికారులతో కలిసి కార్వన్‌పేటలో కలియతిరిగారు. వీధుల్లో మురుగు కాలువలో పూడికతీత పనులను పరిశీలించారు. కాలువల్లో చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలను పారవేయవద్దని పట్టణ ప్రజలకు సూచించారు. బార్‌పేటలో శానిటేషన్ పనులను తనిఖీ చేశారు.